ప్రజాశక్తి
మంగళవారం 15 అక్టోబర్ 2024 5
శ్రీ సత్యసాయి

టోల్‌ప్లాజా వద్ద భారీగా ట్రాఫిక్ జామ్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

దసరా తరువాత తిరుగు ప్రయాణికులతో బాగేపల్లి టోల్ ప్లాజా వద్ద ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. జిల్లా, ఇతర జిల్లాల నుండి బెంగళూరుకు వెళ్లే ప్రయాణికుల వాహనాలు బారులు తీరడంతో గంటలకొద్దీ రాకపోకలు స్తంభించాయి. దీంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ క్లియర్ కావడానికి గంటల సమయంపట్టింది. దీంతో వాహన చోదకులు తీవ్ర అసౌకర్యానికి, అసహనానికి గురయ్యారు.ముఖ్యంగా సాఫ్ట్ వేర్ ఇంజనీర్లు బెంగళూరుకు వెళ్లేందుకు నానా పాట్లు పడాల్సి వచ్చింది. పుట్టపర్తి ,గోరంట్ల, కొత్తచెరువు మండలాల నుండి ప్రయాణికులు ఉదయం నుండి బస్టాండ్‌లో బస్సుల కోసం నిరీక్షించారు. చాలా బస్సులు పండగ సందర్భంగా నడవకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

బాగేపల్లి టోల్ ప్లాజా వద్ద బారులు తీరిన కార్లు

'అధికార'ం ల(కి)క్కు..!

అధికార పార్టీ నేతలకే మెజార్టీ మద్యం దుకాణాలు

పుట్టపర్తిలో లాటరీ తీస్తున్న అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మద్యం దుకాణాల టెండర్లలో ఎక్కువ షాపులు అధికార పార్టీ మద్దతుదారులకు వరించాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మద్యం దుకాణాల టెండర్లలో అత్యధికంగా అధికారపార్టీ నేతలకు దక్కడం విశేషం. అనంతపురం జిల్లాలో 136 మద్యం దుకాణాలకు 3261 దరఖాస్తులు పడ్డాయి. సత్యసాయి జిల్లాలో 87 దుకాణాలకు 1518 దరఖాస్తులు పడ్డాయి. ఇందులో అత్యధికంగా అధికార టిడిపితోపాటు, కూటమిలోని బిజెపి నేతలకు లాటరీలో మద్యం దుకాణాలు దక్కాయి.

బిజెపి జిల్లా అధ్యక్షుడికి ఐదు దుకాణాలు

మద్యం టెండర్లలోకే నేరుగానే నేతలు రంగంలోకి దిగారు. వారికే అత్యధికంగా దుకాణాలు దక్కాయి. ఇందులో హిందూపురం నియోజకవర్గంలో ఐదు దుకాణాలు అనంతపురం బిజెపి జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరెడ్డికి దక్కాయి. ఈయనతోపాటు అనంతపురం, తాడిపత్రి, గుంతకల్లు నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధుల అనుయాయులకు గరిష్టంగా దుకాణాలొచ్చాయి. కొన్ని చోట్ల మాత్రమే ఇతరులకు లక్కీ లాటరీలో వచ్చాయి. వాటిని కూడా ఏదో రకంగా తమ వశం చేసుకోవడానికి అధికారపార్టీ నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇందుకోసం బేరసారాలు నడుస్తుండగా, మాట విననిచోట బెదిరింపులు ఉంటున్నాయి. సత్యసాయి జిల్లా లేపాక్షి సంబంధించిన ఒక దుకాణం వేరే వ్యక్తికి రావడంతో అతడిని కిడ్నాప్ చేసిన కలకలం రేగింది. లోపాయికారిగా అతడి నుంచి దుకాణాన్ని అధికారపార్టీ నేతలే వశం చేసుకునే ప్రయత్నాలు సాగాయన్న ఆరోపణలున్నాయి.

మహిళలకు దక్కిన దుకాణాలు

మద్యం దుకాణాల టెండర్లలో మహిళలూ పాల్గొన్నారు. ఇందులో కొన్ని దుకాణాలు మహిళలకు వచ్చాయి. అనంతపురం జిల్లాలో 136 దుకాణాల్లో 20 దుకాణాలు మహిళలకు లాటరీలో తగిలాయి. ఇందులో ఆరు దుకాణాలు ఒక్క మహిళకే దక్కాయి. సత్యసాయి జిల్లాలో నలుగురు మహిళలకు మద్యం దుకాణాల టెండర్లు లాటరీలో వచ్చాయి.

బేరసారాలు

లాటరీ ప్రక్రియ పూర్తవడంతో టెండర్లు దక్కించుకున్న వారితో బేరసారాలు మొదలయ్యాయి. దరఖాస్తు చేసుకుని లాటరీలో దక్కని వారు వచ్చిన వారితో భాగస్వామ్యం కోసం జోరుగా బేరసారాలు సాగుతున్నాయి. ఈనెల 16వ తేదీ నుంచే దుకాణాలు ప్రారంభించాల్సి ఉన్నందున హడావుడి కొనసాగుతోంది. కొంతమంది టెండర్లు దక్కిన వారు ఇతరులకు భాగస్వామ్యం ఇవ్వడానికి భేటీలు కొనసాగుతున్నాయి. షాపులకు రూములు కోసం కూడా ప్రయత్నాలు సాగుతున్నాయి.

మద్యం టెండర్‌లో కిడ్నాప్ కలకలం

సాయిఆరామం వద్ద నిరసన తెలుపుతున్న రంగనాథ్ కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

మద్యం టెండర్ల విషయంలో కిడ్నాప్ కలకలం రేగింది. సోమవారం జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాలకు టెండర్ ప్రక్రియ లాటరీని పుట్టపర్తి సాయి ఆరామం అతిథి గహంలో న్విహించారు. హిందూపురం నియోజకవర్గం చిలమత్తూరు మండలం ఎగ్గిలి కొత్తపల్లి గ్రామానికి చెందిన రంగనాథ్ అనే వ్యక్తికి లేపాక్షి మండలానికి సంబంధించిన షాప్ నెంబర్ 57లాటరీలో వచ్చింది. లాటరీలో ఆయన పేరు రావడంతో లేపాక్షి టిడిపి నాయకులు ఆయనను కిడ్నాప్ చేశారు. దీంతో ఆయన భార్య అశ్విని బంధువులతో కలసి స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీసులు చుట్టూ తిరిగినా ఆమెకు న్యాయం జరక్కపోవడంతో సాయి ఆరామం గేటు వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. రంగనాథ్ తండ్రి

పోలీసు స్టేషన్ వద్ద ఆత్మహత్యాయత్నం

ఓబులేష్ మాట్లాడుతూ కిడ్నాప్ చేసిన వ్యక్తులు తన కుమారుడు టెండర్ వదిలేయాలని, రూ.10 లక్షలు గుడ్ విల్ ఇస్తామని, ప్రతినెలా 15 వేలు భరణం ఇస్తామని తెలిపారన్నారు. దీనికి తాము ఒప్పుకోకపోవడంతో బెదిరిస్తున్నారని చెప్పారు. తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు. భార్య అశ్విని మాట్లాడుతూ తమకు ఎలాంటి టెండర్ అవసరం లేదని, తన భర్తను వదిలేయాలని కోరుతున్నామన్నారు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు స్టేషన్ వద్ద బాధితుల ఆత్మహత్యాయత్నం

కిడ్నాప్‌కు గురైన వ్యక్తిని వెంటనే తీసుకురావాలని కోరుతూ బాధిత కుటుంబ సభ్యులు సోమవారం రాత్రి పుట్టపర్తి పోలీస్ స్టేషన్ ముందు బైటాయించి ధర్నా నిర్వహించారు. ఇదే సమయంలో రంగనాథ్ తండ్రి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశారు. పోలీసులు స్పందించి అతన్ని నివారించారు. ఇదే సమయంలోనే రంగనాథ్ హిందూపురం పట్టణంలో పోలీసుల వద్ద క్షేమంగా ఉన్నట్లు సమాచారం అందింది. లాటరీలో దుకాణం వస్తే ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయన్ను ఎందుకు పుట్టపర్తికి తీసుకురావడం లేదని కుటుంబ సభ్యులు పోలీసులను నిలదీశారు.

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

సత్యసాయి జిల్లా వ్యాప్తంగా తుపాను ప్రభావంతో మూడు రోజులు పాటు కురిసే వర్షాల వలన ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా అప్రమత్తత్వం ఉండాలని కలెక్టర్ టిఎస్.చేతన్ సూచించారు. సోమవారం ఆయన కలెక్టరేట్లో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 14 నుంచి 17వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు తగినంతగా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. తుపాను విపత్తును ఎదుర్కొనే క్రమంలో జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి క్షేత్రస్థాయిలో ఆయా శాఖ అధికారులు పర్యటించి ప్రజలు, రైతులకు ఎప్పటికప్పుడు ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. డివిజన్, మండల, గ్రామస్థాయిలో అన్ని శాఖల సమన్వయంతో అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. పాత భవనాలలో నివసించే కుటుంబాలు వాటిని వెంటనే ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. వంకలు ప్రవహించే నీటికి దూరంగా ఉండాలన్నారు. రోడ్డుకు అడ్డంగా నీరు ప్రవహిస్తే వాటిని దాటే ప్రయత్నం చేయరాదన్నారు. అత్యవసరం పరిస్థితులు ఉంటే తప్ప ఎవరూ బయటికి రావద్దని తెలియజేశారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా పునరావస కేంద్రాలు, విద్యుత్తు, నీటి సరఫరా, బస్సు సౌకర్యాలు, వైద్య ఆరోగ్యశాఖ సేవల పై అవసరమైన మేరకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే పాఠశాలలకు సెలవులు ప్రకటించామన్నారు. వసతి గహాల విద్యార్థులకు సరైన సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. నాలుగు రోజులు గడిచిన తర్వాత వేరుశనగ పంటను తొలగించుకోవాలన్నారు. కలెక్టర్ కార్యాలయంలో 24/7 పనిచేసే విధంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. సమస్యలు ఏవైనా ఉంటే 08555-289039/939299719 నంబర్లకు సంప్రదించాలన్నారు.

పెనుకొండ టౌన్ : భారీ వర్ష సూచన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు సూచించారు. పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం కమిషన్ మాట్లాడుతూ రానున్న మూడు రోజులు భారీ వర్ష సూచన ఉండడంతో నగర పంచాయతీ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఫోన్ నెంబర్ 08555 221116 సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు.

కలెక్టర్ టిఎస్.చేతన్

నాసిన్, బెల్ భూ నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి

మంత్రి సవితకు వ్యకాసం వినతి

మంత్రి సవితకు వినతిపత్రం ఇస్తున్న వ్యకాసం నాయకులు

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

నాసిన్, బెల్ సంస్థలకు భూములు ఇచ్చిన నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, ఉద్యోగావకాశాలు కల్పించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో వ్యకాసం ఆధ్వర్యంలో భూ నిర్వాసితులు మంత్రి సవితకు వినతి పత్రం ఇచ్చారు. వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ నాసిన్, బెల్ సంస్థల ఏర్పాటు కోసం 2015లో అప్పటి టిడిపి ప్రభుత్వం నిర్వాసితులు (పాలసముద్రం, కావేటి నాగేపల్లి, చిన్నబాబయ్యపల్లి గ్రామాల రైతులు)కు తక్కువ పరిహారం ఇచ్చి బలవంతంగా భూసేకరణ చేపట్టిందన్నారు. ఆయా సంస్థల నిర్మాణ పనులు పూర్తయి ప్రారంభోత్సం చేసి కార్యకలాపాలు సాగిస్తున్నా నిర్వాసితులకు మాత్రం పునరావాసం అందక ఉపాధి కోసం వలస వెళ్తున్నారన్నారు. నిర్వాసితులకు ప్యాకేజీ, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని మూడేళ్లుగా వ్యకా సం ఆధ్వర్యంలో స్థానిక, జిల్లా రెవెన్యూ, ఎపిఐఐసి అధికారులకు విజ్ఞప్తులు చేసినా, నిరసనలు వ్యక్తం చేసినా ఫలితం లేదన్నారు. భూ నిర్వాసితుల్లో ఇప్పటికే 12 మంది మృతి చెందారన్నారు. స్పందించిన మంత్రి పెనుకొండ ఆర్డీవో, జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా కోశాధికారి సాకే వెంకటేశులు, జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు వెంకటరాముడు, నారాయణ, భూనిర్వాసితులు వెంకటలక్ష్మమ్మ, అచ్చమ్మ, రమీజాబి, గంగమ్మ, వెంకటరాముడు, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు రవి అధ్యక్షతన మంత్రి సవితకు వినతిపత్రం ఇచ్చారు. నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేశులు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా భవన నిర్మాణ రంగంపై ఆధారపడి 5 లక్షల మంది జీవనం సాగిస్తున్నారన్నారు. ఎన్నికల హామీ మేరకు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ప్రస్తుత ఇసుక పాలసీపై సమీక్ష చేసి ధరలు అందుబాటులో ఉంచాలని, ఇసుకను వెంటనే ఉచితంగా సరఫరా జరిగేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. స్పందించిన మంత్రి ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, గుర్తింపు కార్డుల విషయమై కార్మిక శాఖ అధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కెవిపి ఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, జిల్లా కమిటీ సభ్యులు రామాంజనేయులు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు తిప్పన్న, రంగప్ప, ప్రతాప్, ప్రసాద్, రామాంజనేయులు, ముద్ద వెంకటప్ప, వెంకటరమణప్ప, శ్రీరాములు, మాబాషా, బాబాజన్, రఫిక్, చిన్నిక్, ప్రసాద్ పాల్గొన్నారు.

రొళ్ల నూతన ఎంపిడిఒగా ప్రసాద్

ప్రజాశక్తి-మడకశిర

రొళ్ల మండల నూతన ఎంపిడిఒగా ప్రసాద్ సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాల యంలో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపిడిఒ ఆజాద్ బదిలీపై మరో మండలానికి వెళ్లారు. నూతన ఎంపిడిఒ మాట్లాడుతూ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

నూతన పంచాయతీ కార్యదర్శికి సన్మానం

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని బ్రహ్మసముద్రం పంచాయతీ నూతన కార్యదర్శిగా శివశంకర్‌నాయక్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనను జనసేన పార్టీ మండల కన్వీనర్ మహేష్ ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యదర్శి మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో సమస్యలపై దృష్టి ప్రత్యేక సారిస్తానని, ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పార్టీలకతీతంగా ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకలు సిద్దలింగప్ప, రమేష్, నాగభూషణ, గంగాధర్, నారాయణప్ప, నరసింహప్ప పాల్గొన్నారు.

దానిమ్మ తోటల పరిశీలన

ప్రజాశక్తి-మడకశిర

నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో రైతులు సాగుచేసిన దానిమ్మ తోటలను సోమవారం కర్నాటకలోని చిత్రదుర్గ జిల్లా ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్ సవితదేవరాజు పరిశీలించారు. అందులో భాగంగా మండలంలోని తడకలపల్లిలో రైతు డి.రంగప్ప సాగుచేసిన దానిమ్మ తోటను సందర్శించి పంట సాగు పద్ధతులపై రైతులను అడిగి తెలుసుకున్నారు. అలాగే రైతులకు కొన్ని సూచనలు చేశారు. ఆయన వెంట రైతులు సుజాతపాండురంగప్ప, గీతారాజు, జ్యోతిరంగనాథ్, భవ్యమంజునాథ్, కోమల హరికృష్ణ, అశ్విని విద్యాసాగర్‌గౌడ్, రామప్పలక్ష్మమ్మ ఉన్నారు.

దానిమ్మతోటను పరిశీలిస్తున్న కర్నాటక అధికారి

నిరుపేదల కోసమే అన్న క్యాంటీన్లు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర

నిరుపేదల ఆకలి తీర్చడానికే ప్రభుత్వం అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను సోమవారం ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ప్రారంభించి మాట్లాడారు. అన్న క్యాంటీన్‌లో కేవలం రూ. 5కే ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, సాయంత్రం నాణ్యమైన భోజనం అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కుంచితి వక్కలిగ టిడిపి రాష్ట్ర కన్వీనర్ విఎం.పాండురంగప్ప, టిడిపి మండలాల కన్వీనర్లు, ప్రధాన కార్యదర్శులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే రాజు దంపతులు

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

కొత్తచెరువు : భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు మండల కార్యదర్శి ముత్యాలు కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఎమ్మెల్యే సింధూర రెడ్డిని కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. వారు మాట్లాడుతూ గతంలో ఉన్న భవన నిర్మాణ కార్మిక సంఘం బోర్డు రద్దు చేశారని తిరిగి దానిని పునరుద్ధించాలని కోరారు. అలాగేఉచిత ఇసుకను అమలు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 5 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారని వీరికి ఉపాధి లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గతంలో సంక్షేమ బోర్డు ద్వారా గతంలో అనేక పథకాలు అమలు చేసే వారిని ఇప్పుడు నిలిపివేయడంతో ఎలాంటి పథకాలు అందలేదని కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బోర్డును పునరుద్ధరిస్తామని ఎన్నికలలో హామీ ఇచ్చారని ఇచ్చిన హామీ మేరకు తక్షణమే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బాళ్ల అంజి, సిఐటియు నాయకులు శంకర్ రెడ్డి, నాగమణి, శ్రావణి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పవన్ కుమార్ పాల్గొన్నారు.

లేబర్ కార్యాలయం ధర్మవరానికి మార్చాలి

ప్రజాశక్తి,- ధర్మవరం రూరల్

ధర్మవరంలో లేబర్ ఆఫీస్ ఏర్పాటు చేయాలని సిఐటియు నాయకులు కోరారు. ఈ మేరకు సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం స్థానిక గాంధీ విగ్రహంవద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు జెవి. రమణ, టి. అయూబ్ ఖాన్, ఎం బాబు మాట్లాడుతూ ధర్మవరంలో గతంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీస్ ఉండేదన్నారు. అయితే గత ప్రభుత్వ హయాంలో శ్రీ సత్యసాయి జిల్లా ఏర్పడిన తర్వాత ధర్మవరంలో ఉన్న లేబర్ ఆఫీసును కొత్తచెరువుకు తరలించారన్నారు. దీంతో ధర్మవరం డివిజన్ ప్రాంతంలో గల వేలాదిమంది కార్మికులు లేబర్ ఆఫీస్ సేవలకు దూరం అయ్యారని చెప్పారు. లేబర్ ఆఫీసును వెంటనే ధర్మవారానికి తరలించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పుల్లన్న, ఓబులేసు, వెంకటేష్, వెంకట్రాముడు, పెద్దక్క, ముకుంద, జయమ్మ, చౌడమ్మ, నాగవేణి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి

ప్రజాశక్తి-రొద్దం

ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించి విధుల్లో కొనసాగించాలని కోరుతూ సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒప్పంద అధ్యాపకులు పసుపు బ్యాడ్జీ ధరించి విధులకు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఒప్పంద అధ్యాపకులను పర్మినెంట్ చేస్తామని జీవో 114ను విడుదల చేసిందన్నారు. క్రమబద్ధీకరణ ప్రక్రియ మొత్తం పూర్తయినా ఎన్నికల కోడ్ రావడంతో నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు టిడిపి నాయకులు అధికారంలోకి వస్తే 114 జీవోను అమలు చేసి ఒప్పంద అధ్యాపకులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని కావున వెంటనే క్రమబద్ధీకరణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఒప్పంద అధ్యాపకులు పాల్గొని జై తెలుగుదేశం జై ఎన్టీఆర్ అంటూ నినాదాలు తెలియజేశారు.

పసుపు బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

సిఐటియు శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ దిల్షాద్

అత్యాచార ఘటనపై నిరసన తెలుపుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఈఎస్ వెంకటేష్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ దిల్షాద్

ప్రజాశక్తి-హిందూపురం

సామూహిక అత్యాచారానికి పాల్పడ్డ నిందితులను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేపట్టి కఠినంగా శిక్షించాలని సిఐటియు శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ దిల్షాద్ డిమాండ్ చేశారు. అత్యాచారానికి గురైన బాధితులను పరామర్శించడానికి సోమవారం సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఈఎస్ వెంకటేష్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ దిల్షాద్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, ఉషారాణి తదితరులు హిందూపురం వచ్చారు. బాధితులను కలవడానికి ఆసుపత్రి సుపరింటెండెంట్ లింగన్నను అనుమతి కోరారు. ఆయన సూచన మేరకు వన్ టౌన్ సిఐ రాజగోపాల్ నాయుడును సంప్రదించగా ఉన్నతాధికారుల అనుమతి లేనిదే అనుమతించమ న్నారు. దీంతో ఫోన్ ద్వారా డిఎస్‌పి మహేష్‌ను అనుమతి కోరారు. దీంతో ఆయన కేవలం మహిళలకు మాత్రమే కలవడానికి అనుమతి ఇస్తామని చెప్పారు. దీంతో దిల్షాద్, శ్రీదేవి, కెవిపిఎస్ నాయకురాలు జ్యోతమ్మ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ నిందితులను పోలీసులు వెంటనే అరెస్టు చేసి, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేపట్టి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మంత్రి, ప్రభుత్వ పెద్దలు ఇచ్చిన హామీ మేరకు బాధితుల కుటుంబానికి భద్రత కల్పించి, వారిని అన్ని విధాలా ఆదుకోవాలని, లేనిచో బాధితుల పక్షాన పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు మత్తు పదార్థాల వల్లే జరుగుతున్నాయని వీటిని నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. వలస కార్మిక చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్‌పి శ్రీనివాసులు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ హిందూపురం ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు లావణ్య, శోభారాణి, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంవి రమణ, ఐద్వా జిల్లా నాయకురాలు జ్యోతమ్మ, జైభీమ్ నాయకులు నాగరాజు, సిఐటియు పట్టణ నాయకులు విఆర్ రాము, రామకృష్ణ, సదాశివరెడ్డి పాల్గొన్నారు.

పెనుకొండ టౌన్ : అత్త, కోడలిపై సామూహిక అత్యా చారానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరుతూ పెనుకొండ పట్టణ ప్రజా సంఘాలు, దళిత సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయంలో అధికారి ప్రసాద్‌కు వినతి పత్రం సమర్పిం చారు. అలాగే బాధితులకు ప్రభుత్వం రూ. 10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, పునరా వాసం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కమ్యూనిస్టు పార్టీ నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, మాలమహానాడు నాయకులు శ్రీరాములు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి టి.రామాంజనేయులు, ఎంఎన్ మూర్తి, పెనుకొండ నరసింహులు, నారాయణ, బి.నరసింహులు, కురుబవాండ్లపల్లి మాల లక్ష్మీనారా యణ, పోతలయ్య, కోనాపురం ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

పేదల కడుపు నింపడమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కదిరి టౌన్

పేద ప్రజల ఆకలి తీర్చి వారి కడుపు నింపాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యం అని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం కదిరి పట్టణం ఆర్ అండ్ బి బంగ్లా పక్కన ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యేతో పాటు హిందూపురం పార్లమెంట్ సభ్యులు బి.కె.పార్థసారథి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో టిడిపి హయాంలో రూ. 5ల కే అన్న క్యాంటీన్ ద్వారా మూడు పూటలా భోజనం అందించారని గుర్తు చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి రాష్ట్రవ్యాప్తంగా పేదల కడుపు కొడుతూ అన్నా క్యాంటీన్లను మూసివేసిందని విమర్శించారు. తిరిగి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్‌ను తిరిగి ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు ఎమ్మెస్ పార్థసారథి, జనసేన ఇన్‌ఛార్జి భైరవ ప్రసాద్, టిడిపి నాయకులు పవన్ కుమార్ రెడ్డి బంగారు కృష్ణ మూర్తి, పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, తెలుగు యువత అధ్యక్షులు కొమ్మినేని గంగయ్య, జనసేన మహిళా నాయకులు సత్యవతి, టిడిపి మహిళా నాయకులు పర్వీన్ బాను, మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు బత్తలపల్లి విద్యార్థులు

ప్రజాశక్తి - బత్తలపల్లి

అన్నమయ్య, తూర్పుగోదావరి జిల్లాల్లో నవంబర్, డిసెంబర్ నెలల్లో జరిగే స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు మండలంలోని రామాపురం ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ఆ హెచ్ ఎం వెంకటనాయుడు, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మీ నారాయణ తెలిపారు. వారు మాట్లాడుతూ అండర్ 14 బాలికల విభాగంలో ప్రణీత,అండర్ 17 బాల బాలిక విభాగంలో ఇబ్రహీం, చందన, ధనుష ఎంపికయ్యారన్నారు. ఎంపికైన క్రీడాకారులు నవంబర్, డిసెంబర్ నెలలో అన్నమయ్య జిల్లా, తూర్పుగోదావరి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను వారు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికుల (పే)రుతో ప్రభుత్వ భూమి హాంఫట్..!

◆ రూ. కోట్లు విలువజేసే భూమి స్వాహా
◆ అసలు కార్మికులకు అన్యాయం
◆ లబోదిబోమంటున్న భవన నిర్మాణ కార్మికులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

ప్రతిరోజూ ఉదయం లేవగానే పొట్టచేత బట్టుకొని తాపీ చేతబట్టి ఇంటి నిర్మాణ కూలీ పనులకు వెళ్తేగాని కుటుంబ సభ్యులు మూడు పూటలా కాస్త ముద్ద తినలేని పరిస్థితులు వారివి.అలాంటి వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చాడు. కూలీ పనులకు వెళ్తే వచ్చే అరకొర సంపాదనతో ఆ పేద కార్మికులకు పూట గడవడమే గగనం. అలాంటి వారికి ప్రభుత్వం నుంచి ఇళ్ల పట్టాలు ఇచ్చేవరకు పోరాడుతానని కొండంత ఆశా వారిలో రేకెత్తించాడు. నిజమే అని నమ్మి వెంట నడిచిన కార్మికులను నట్టేట ముంచాడు. అప్పట్లో ప్రభుత్వం పేద కార్మికుల కోసం వారి పేరు మీద పట్టాలు మంజూరు చేయగా వారందరి పట్టాలను లాగేసుకున్నాడు. ఆ పట్టాలను వారికి ఇవ్వకుండా కోట్ల రూపాయల విలువచేసే భూమిని తన అధీనంలో పెట్టుకొని అర్హులైన పట్టా పొందిన లబ్ధిదారులను ఆ భూమిలోకి అడుగు పెట్టనీయకుండా తనకు నచ్చిన కొందరు కార్మికులకు, మరికొంత మంది బయట వ్యక్తులకు ఇబ్బడి ముబ్బడిగా విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. ఈ నయవంచకుడి గురించి బాధిత కార్మికులు తెలిపిన వివరాలు...

అప్పట్లో కదిరిలో భవన నిర్మాణ రంగానికి చెందిన కొందరు కార్మికులు వారి సమస్యలు పై చర్చించేందుకు ఇతరత్రా సమావేశాలు బాగోగులు కోసం సంఘం ఏర్పాటు చేయాలనుకున్నాడు. ఈ నేపథ్యంలో కొందరు నాయకులు ముందుకొచ్చి 2002 సంవత్సరంలో రిజిస్టర్ నెంబర్ 1949పై కదిరి భవన నిర్మాణ కార్మిక సంఘంగా ఏర్పాటు చేసుకున్నారు. అనంతరం కార్మికులకు సంబంధించి ఆంజనేయ స్వామి గుడి వెనుక స్థలం ఉండేది. దీంతో ఆ స్థలాన్ని ప్రయివేటు వ్యక్తులకు విక్రయించగా వచ్చిన డబ్బుతో 2007 సంవత్సరంలో హిందూపూర్ రోడ్డు లో ప్రైవేట్ వ్యక్తులకు సంబంధించిన 1713 -2,లో 3.10 సెంట్లు, అలాగే 1769, 1770 సర్వే నెంబర్లలో భూమిని తీసుకున్నారు. ఆ భూమికి చెందిన యజమానులు కార్మికులు కోసం ధార దత్తం చేస్తున్నామని ఈ భూమి భవన నిర్మాణ కార్మిక సంఘానికి చెందేలా ఆ కార్మిక సంఘం పేరు మీద డాక్యుమెంట్ నెంబర్ 1175 తో శాశ్వత అగ్రిమెంట్ చేయించి ఇచ్చారు. అలాగే వారి పేరు పై ఉన్న పట్టాను రద్దు చేసి అప్పట్లో ఆ భూమి లో కార్మికులకు ఇంటి పట్టాలు ఇవ్వాలని రెవిన్యూ అధికారులకు తెలిపారు. దీంతో రెవిన్యూ అధికారులు ఇంతకు ముందే కొందరికి ఇచ్చిన పట్టాను రద్దు చేసి 2007 సంవత్సరంలో హెచ్ఎస్ఆర్డిఐఎస్ ఫైలు నెంబర్ 35/1417 పేరుతో 323 మంది భవన నిర్మాణ కార్మికులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. దీంతో కార్మికులు త్వరలో సొంతింటి కల సాకారం కాబోతుందని సంబర పడ్డారు. ఇంతలో వారు నమ్మిన ఆ నాయకుడి స్వార్థం బయట పడింది. కోట్ల రూపాయల విలువ చేసే ఆ భూమిని కాజేయాలనుకున్నాడు. అంతే 1713 సర్వేనెంబరులో కార్మికుల సౌకర్యార్థం కమ్యూనిటీ హాలు నిర్మిద్దామి, మిగతా 1769 ,1770 సర్వేనెంబరులోని భూమిలో ముందర వెనుక తేడా లేకుండా కార్మికులకు లాటరీ పద్ధతిలో స్థలాలు కేటాయిద్దామని నమ్మబలికాడు. అప్పట్లో కొందరి దగ్గర డబ్బులు తీసుకొని పట్టాలు ఇచ్చినట్లు భాదితులు ఆరోపిస్తున్నారు. అప్పటి నుండి నేటి వరకు దాదాపు 17 సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ అందులో ఒక్క కార్మికుడు ఇంటి నిర్మాణం చేపట్టలేదు. కార్మికులు తమకు పట్టా ఉందని ఇంటి నిర్మాణం చేపట్టడానికి వెళ్తే అడ్డుతగులుతున్నారని బాధితులు వాపోయారు. 'మీకు సంబంధం లేదు. మీకు ఎవరు పట్టా ఇచ్చారు.ఈ భూమి నాది' అంటూ పేద కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వసూళ్ల పర్వం : 2002 సంవత్సరంలో రిజిస్టర్ నెంబర్ 1949 భవన నిర్మాణ సంఘానికి అప్పట్లో అధ్యక్షుడుగా కొనసాగిన నాయకుడు ఆ యూనియన్ నుండి బయటకి వచ్చినా ఆ భూమిపై పెత్తనం చెలాయిస్తున్నాడు. భూమి అభివృద్ధి అన్న పేరుతో ప్రతి కార్మికుడి నుండి 1250 రూపాయలు వసూలు చేశాడు. ఆ భూమికి సంబంధించిన గత స్కెచ్ కాకుండా కొత్తది తయారు చేయించుకున్నాడు. ప్రభుత్వం కార్మికులకు మంజూరు చేసింది 323 పట్టాలు అయితే కొత్త స్కెచ్‌లో 500 పట్టాలు చూపిస్తూ వసూలుకు తెరలేపాడని కార్మికులు ఆరోపిస్తున్నారు. కొందరి వ్యక్తులను ఏర్పాటు చేసుకొని వారి ద్వారా వేల రూపాయలు వసూలు చేసినట్లు ఆరోపిస్తున్నారు. అప్పట్లో పట్టాలు పొందిన అర్హులైన కార్మికులను అటు వైపు రానీయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు. అలాగే కార్మికులకు మంజూరు చేసిన ఆ సర్వే నెంబర్ పక్కనే ఉన్న భూమిలో యథేచ్ఛగా గుట్టను తవ్వి పట్టాలకు సిద్ధం చేస్తున్నాడు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, అధికారులు స్పందించి ఈ భూ భాగోతంపై విచారణ జరిపించి కార్మికులకు న్యాయం చేయాలని కార్మికులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

పట్టణంలోని తారకరామాపురానికి చెందిన యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు, తారకరామాపురానికి చెందిన రమేష్ ద్విచక్ర వాహనం లో ఇంటి వద్ద నుండి పట్టణం లోకి వస్తూ ఉండగా ధర్మవరం టౌన్ పాత రిజిస్టర్ కార్యాలయం సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొంది. ఈ ప్రమాదంలో రమేష్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రుడని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-పెనుకొండ

స్నేహితులతో కలిసి సరదాగా గొల్లపల్లి రిజర్వాయర్‌లో ఈత కొట్టేందుకు వెళ్లి గల్లంతైన డిగ్రీ విద్యార్థి చంద్రశేఖర్‌రెడ్డి మృతదేహం సోమవారం లభ్యమైంది. ఆదివారం రిజర్వాయర్‌లో గల్లంతైన చంద్రశేఖర్‌రెడ్డి కోసం పోలీసులు, ఫైర్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం ఉదయం మృతదేహాన్ని రిజర్వాయర్ నుంచి బయటికి తీశారు. కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి సవిత గొల్లపల్లి రిజర్వాయర్ వద్దకు చేరుకుని మృతి చెందిన విద్యార్థి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రజల కోరిక మేరకు రిజర్వాయర్ వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని, సందర్శకులు కూడా తగిన జాగ్రత్తలు పాటించాలని మంత్రి తెలిపారు.

నిందితులను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - కదిరి టౌన్

చిలమత్తూరు మండలంలో సామూహిక అత్యాచారానికి పాల్పడిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కదిరి సిఐ డివి నారాయణరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ వలస వచ్చిన కుటుంబం పైన సామూహిక అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళలకు రక్షణ లేకుండా పోతోందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జగన్మోహన్, రామ్మోహన్, ముస్తక్, బాబ్జాన్, నారాయణ, ఆంజనేయులు, రఫీ, నాగరాజు, కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

సిఐకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సెమిస్టర్ ఫలితాల్లో మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

డిగ్రీ ద్వితీయ సెమిస్టర్ ఫలితాలలో శ్రీ పద్మావతి డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనపర్చారు. పట్టణంలోని శ్రీ పద్మావతి డిగ్రీ కళాశాల విద్యార్థినులు పట్టణ ప్రథమస్థానంలో నిలిచినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ మల్లికార్జున తెలిపారు. బీఎస్సీ (హానరస్) ఆర్. వైష్ణవి 95 శాతం, పి .మమత 92, పి. ధరణి 90, బీకాం హానర్స్ గ్రూపులో ఎం. జ్యోతి 88, కే. విజయదుర్గ 87, సి. అనూష 86, ఎం. మానస 86, , వై. యుగలక్ష్మి 85, బీబీఏ హానర్స్ గ్రూపులో ఎస్. యాస్మిన్ 83, కె. అయిషా బాను 79, ఎం. కళ్యాణి 77, డి. హిమబిందు 76 శాతం మార్కులు సాధించారన్నారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపల్‌తో పాటు కరస్పాండెంట్ సాయి, డైరెక్టర్ జగదీష్, బోధన, భోదనేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థినులపై నిర్లక్ష్య ధోరణి తగదు

ప్రజాశక్తి - కదిరి టౌన్

విద్యార్థినులు పట్ల ఎబిసిడబ్ల్యూఒ నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించడం సమంజసం కాదని ఎన్ఎస్‌యుఐ నాయకుడు ఉపేంద్ర అన్నారు. దసరా పండుగ సందర్భంగా డిగ్రీ కళాశాలలకు సెలవులు రావటంతో హాస్టల్ విద్యార్థినులు ఇంటికి వెళ్లారన్నారు. సోమవారం కాలేజ్ లు తిరిగి ప్రారంభం కావడం తో డిగ్రీ కళాశాల విద్యార్థులు హాస్టల్‌కి వచ్చారని చెప్పారు. విద్యార్థినులకు హాస్టల్ తెరవకుండా హాస్టల్ వార్డెన్లు ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ఉన్నతాధికారులు స్పందించి ఏబీసీడబ్ల్యూవో బాలాజీ, హాస్టల్ వార్డెన్ షబానాపై చర్యలు తీసుకోవాలని నాయకులు సంతోష్, నాగ,టిప్పు సుల్తాన్,మహేష్ తదితరులు డిమాండ్ చేశారు.

కొనసాగిన ఆర్‌టిసి ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ఉద్యోగులపై పనిభారం తగ్గించాలన్న డిమాండ్‌తో ఆర్టీసీ ఉద్యోగులు చేస్తున్న నిరసన సోమవారం తొమ్మిదవ రోజు కొనసాగింది. ఈసందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ. ఉద్యోగుల పట్ల నిర్లక్ష్య వైఖరిని వీడి వెంటనే సమస్యలను పరిష్కరించే దిశగా డిపో మేనేజర్ వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులను మానసికంగా పనిష్మెంట్ల రూపంలో వేధించకూడదని యాజమాన్యం ఉద్యోగులపై పెంచిన పనిభారాలు వెంటనే తగ్గించాలని యూనియన్ నాయకులు కోరారు. ఉద్యోగుల సమస్యలపై అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్చలు నిర్వహించి ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఈనెల 14 నుండి ఎర్ర బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ సత్యసాయి జిల్లా అధ్యక్షులు నాగార్జునరెడ్డి , డిపో కార్యదర్శి ముస్తఫా. మల్లికార్జున మూర్తి తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ ఉత్తర్వుల మేరకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి బాలాజీ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ అభ్యర్థుల కుటుంబ వార్షికాదాయం రూ.2.50 లక్షలు కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులను ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ పరీక్ష ద్వారా ఎంపిక చేయబడుతుందన్నారు. ఉచిత భోజన, వసతి సౌకర్యాలతో కూడిన మూడు నెలల పాటు శిక్షణ పొందుటకు అర్హుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 21 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎంపిక చేసిన అభ్యర్థులకు వచ్చే నెల 6వ తేదీ నుంచి ప్రారంభమవుతుందన్నారు.

బదిలీ అధికారులకు సన్మానం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండల అభివృద్ధి కార్యాలయంలో పలువురు అధికారులు బదిలీపై వెళుతున్న సందర్భంగా వారిని అధికారులు సోమవారం సన్మానించారు. పుట్టపర్తి ఎంపీడీవో కార్యాలయం లో పని చేస్తూ బదిలీ పై వెళ్తున్న ఇఒఆర్‌డి అశోక్ కుమార్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ సుబ్రమణ్యం, పంచాయితీ కార్యదర్శులు జయపాల్ రెడ్డి, తేజ, పుష్ప, శివ శంకర్ నాయక్, మహమ్మద్ హాజిత్‌ను అధికారులు సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి రమణారెడ్డి, మాజీ ఎంపిపి శ్రీరామ రెడ్డి, ఇన్‌ఛార్జి ఎంపీడీవో ఇందిరా బాల, కార్యాలయ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

పౌర్ణమి సందర్భంగా అరుణాచలంలో గిరిప్రదక్షణలో పాల్గొనేందుకు కదిరి డిపో నుండి ఈనెల 16న ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు అసిస్టెంట్ మేనేజర్ హరిత చెప్పారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ బస్సులు మొదట గోల్డెన్ టెంపుల్‌లో దర్శించుకుని అరుణాచలానికి వెళతాయన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం నల్లచెరువు, తనకల్లు, ములకలచెరువు, అంగళ్లలో కూడా బస్సు టికెట్లు అందుబాటులో ఉంచినట్లు వివరించారు.

ఉరుసు ఉత్సవాలను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణ సమీపంలో ఉన్న లేపాక్షి మండలం నాగేపల్లి వద్ద ఉన్న హజరత్ పీర్ భక్తర్ వలి ఉరుసు మహోత్సవాలను మంగళవారం నుంచి మూడు రోజుల పాటు జరుగుతాయని, ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని దర్గా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మక్తియర్, శ్రీనివాస్ రెడ్డి కోరారు. ఈ ఉరుసు ఉత్సవాలను ఈ ప్రాంత ప్రజలతో పాటు కర్ణాటక, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులందరికీ అవసరమైన ఏర్పాట్లను చేసామన్నారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులతో పాటు అహలే సున్నతుల్ జమాత్ అధ్యక్షులు మహబూబ్ దౌలా, కోశాదికారి షబ్బీర్, ముస్లిం నగర, అఖిలభారత ఫ్రీడమ్ ఫైటర్ షాహి టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షులు ఉమర్ ఫారూఖ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసి ఏజెంట్ల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - కదిరి అర్బన్

లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఏజెంట్ల సమస్యలను పరిష్కరించాలని సోమవారం ఎల్ఐసి కార్యాలయం వద్ద నిరసన చేశారు. బోనస్ పెంచాలని, జిఎస్టి తొలగించాలని ఏజెంట్లు డిమాండ్ చేశారు.ఏజెంట్స్ సమస్యలు పరిష్కరించాలని,చిన్న పాలసీ విధానం ఉండాలని కోరారు. లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ మేనేజ్ మెంట్ మీద నిరసన కార్యక్రమాలు ఈ నెల 28 వ తేదీ వరకు కొనసాగుతాయని ఏజెంట్ యూనియన్ నాయకులు నరసింహులు మురళి తెలిపారు. ఈ కార్యక్రమంలో లోకేష్ రెడ్డి తదితర నాయకులతో పాటు ఎల్ఐసి ఏజెంట్లు పాల్గొన్నారు.

తుపాను హెచ్చరికలపై అప్రమత్తంగా ఉండండి

ప్రజాశక్తి-సోమందేపల్లి

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో భారీ వర్ష సూచనలు ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెనుకొండ ఆర్డీవో ఆనంద్‌కుమార్ సూచించారు. ఆయన సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండల అధికారులతో సమావేశం నిర్వహించి అధికారులు, ప్రజలకు పలు సూచనలు చేశారు. అల్పపీడన ప్రభావంతో ఈ నెల 18వ తేదీ వరకూ జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, మండలంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు రైల్వే అండర్ బ్రిడ్జిల కింద కాకుండా వేరే మార్గాల్లో రాకపోకలు సాగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పాత భవనాల్లో ఉండే వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లేలా చూడాలన్నారు. విద్యుత్ పరికరాలు, మురుగు కాలువలు, కల్వర్టులు, వరద ప్రవాహాల వద్దకు వెళ్లొద్దన్నారు. విద్యుత్ అంతరాయాలకు అవకాశం ఉంటుందని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. వర్షాలు పూర్తిగా తగ్గేంత వరకూ చిన్నారులను పాఠశాలకు పంపవద్దన్నారు.

బత్తలపల్లి :వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ ప్రమాదానికి గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని ట్రాన్స్‌కో ఎఇ ఈ శివయ్య ప్రజలకు సూచించారు. సోమవారం స్థానిక విద్యుత్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదానికి గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తడిసిన కరెంట్ స్థంభాలను తాకరాదన్నారు. విద్యుత్ లైనుకు చెట్టు కొమ్మలు తాకుతుంటే సంబంధిత అధికారికి తెలియజేయాలని సూచించారు. ఆరుబయట ఏర్పాటు చేసుకున్న లైట్లను నీటిలో తడవకుండా చూసుకోవాలన్నారు. గాలి దుమారం వర్షం వలన తెగిన విద్యుత్ వైర్లను ముట్టుకోరాదన్నారు.ఉరుములు, మెరుపులతో వర్షం పడేటప్పుడు డిష్ కనెక్షన్ తీసివేయాలన్నారు. వర్షం పడుతున్న సమయంలో టీవీ, ఫ్రిడ్జ్, కంప్యూటర్ స్విచ్‌లను ఆఫ్ చేయాలన్నారు. లేకపోతే షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉందన్నారు. జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ స్వర్ణలత సూచించారు.. సోమవారం ఆమె స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ మూడు రోజులు పాటు భారీ వర్షాలు రావచ్చన్న వాతావరణ శాఖ సూచనల మేరకు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామస్థాయిలో అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పరిగి : వరదల ప్రభావం ఉండే అవకాశం ఉందని ఎప్పటికప్పుడు అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలను అప్రమత్తం చేసే విధంగా పనిచేయాలని పెనుగొండ ఆర్డీవో ఆనంద్ కుమార్ ఆదేశించారు. సోమవారం పరిగి మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో వరద ప్రభావంపై మండల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదల్లో జన, జంతు నష్టం జరక్కుండా ముందస్తుగా గుడిసెల్లో ఊరి బయట ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. బయట ప్రాంతాల్లో ఉండే పశువులు పిడుగుపాటుకు గురి కాకుండా తగు జాగ్రత్తలు తీసుకొనేలా పాడి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వీఆర్ఏలు వీఆర్వోలు గ్రామస్తులకు అందుబాటులో ఉండాలన్నారు. మండలంలో పెన్నా జయమంగళ పరివాహక ప్రాంతాల్లో జీవిస్తున్న ప్రజలను అప్రమత్తం చేసే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అన్నారు. ఈ తుఫాను ప్రభావం మూడు రోజుల పాటు ఉండే అవకాశం ఉందని ఎప్పటికప్పుడు విద్యుత్ అధికారులతో అందుబాటులో ఉండి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా అధికారులు సంయుక్తంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్, ఎంఇఒ లక్ష్మీదేవితో పాటు అన్ని శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

హిందూపురం : రానున్న రెండు రోజులు మండల వ్యాప్తంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ పంచాయితీ అధికారులను ఆదేశించారు. దీంతో సోమవారం తూమకుంట, తోళాపురం పంచాయితీ కార్యదర్శి కెంచరాయప్ప ఆధ్వర్యంలో పంచాయితీ, సచివాలయ సిబ్బంది కలిసి తూమకుంట, గోళాపురం గ్రామాల్లో దండోర వేయించడంతో పాటు మైకులు ఏర్పాటు చేసుకుని ప్రజలను అప్రమత్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా మద్యం దుకాణాల లాటరీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లా కలెక్టర్, అధికారుల, పోలీసుల సమక్షంలో మద్యం దుకాణాల టెండర్ల వేలాన్ని సోమవారం పగడ్బందీగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సాయి ఆరామం ఫంక్షన్ హాలులో ఉదయం 8 గంటలకు ప్రారంభించారు. శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా 87 మద్యం దుకాణాలకు గాను 1519 మంది టెండర్లు దాఖలు చేశారు. జిల్లాలోని మద్యం దుకాణాల లాటరీ ద్వారా ఎంపిక ప్రక్రియ కలెక్టర్ టి యస్ చేతన్ ఆధ్వర్యంలో పకడ్బందీగా నిర్వహించారు. శ్రీ సత్య సాయి జిల్లాలో ఆరు నియోజకవర్గాల పరిధిలో పుట్టపర్తి నియోజకవర్గంలో 13 షాపులకు గాను 424 టెండర్లు దాఖలు చేసి జిల్లాలోనే ముందు వరుసలో నిలిచారు. పెనుకొండ నియోజకవర్గం 15, షాపులకు గాను 338, ధర్మవరం నియోజకవర్గం 20 మద్యం షాపులకు గాను 219, హిందూపురం నియోజకవర్గం 9 షాపులకు185, మడకశిర 10 గాను, 162, కదిరి నియోజక వర్గం 15 షాపులకు గాను161, రాప్తాడు నియోజకవర్గం లో ఐదు షాపులకు గాను 29 దరఖాస్తులు వచ్చాయి. శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పుట్టపర్తిలో 30 పోలీస్ యాక్ట్ ను అమలుపరిచారు. అదేవిధంగా పుట్టపర్తి పట్టణంలో 144 సెక్షన్ కూడా అమలులో ఉంచారు. అభ్యర్థులు అయిన వ్యక్తులను మాత్రమే పట్టణంలోకి అనుమతించారు. పుట్టపర్తి మండల పరిధిలోని గ్యాస్ గోడౌన్, కోవెలగుట్టపల్లి వద్ద వారి వాహనాలు ఉంచే విధంగా ఏర్పాట్లు చేశారు.

పల్లె ప్రగతికి బాటలు వేద్దాం

అభివృద్ధి పనులను భూమిపూజ చేస్తున్న పుట్టపర్తి, మడకశిర ఎమ్మెల్యేలు పల్లె సింధూర, ఎంఎస్ రాజు, తదితరులు

ప్రజాశక్తి - కొత్తచెరువు

పల్లెల అభివృద్ధికి బాటలు వేస్తామని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా సోమవారం కొత్తచెరువు మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డితో పాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. జోరువర్షంలోనే ఈ కార్యక్రమం కొనసాగింది. మండలంలోని అన్ని గ్రామాలకు కలిపి రూ.3.30 కోట్ల అంచనాతో పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. పుట్టపర్తి నియోజకవర్గంలో సుమారు రూ.20 కోట్లకు పైగా నిధులతో అన్ని గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రయినేజీ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, నాయకులు లక్ష్మీనారాయణ, శివ ప్రసాద్, కాంటాక్ట్ లక్ష్మీనారాయణ, నాగేంద్ర, వెంకటేష్, సుధాకర్, సురేష్, నాయుడు, తహశీల్దార్ నీలకంఠా రెడ్డి, ఎంపీడీవో నటరాజు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, జేఈ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఏఈ పై ఎమ్మెల్యే ఆగ్రహం : కొత్తచెరువు విద్యుత్ ఏఈ వెంకటేష్ నాయక్‌పై ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన పనితీరును తప్పు పట్టారు. ఈసందర్భంగా స్థానికులు విద్యుత్ సమస్యలపై ఎమ్మెల్యే కి ఫిర్యాదు చేశారు. దీంతో ఎమ్మెల్యే ఎఇని పిలిపించి మాట్లాడారు.విద్యుత్ సమస్యలపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. సాక్షాత్తు ఎమ్మెల్యే ఫోన్‌చేసినా ఎందుకు స్పందించడం లేదని వివరణ అడిగారు. మండల సర్వసభ్య సమావేశంలో కూడా స్థానిక ప్రజాప్రతినిధులు విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేశారని పది రోజుల్లోగా సమస్యను పరిష్కరించాలని చెప్పినప్పటికీ ఇంతవరకు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకొని ప్రజల కోసం పనిచేయాలని హెచ్చరించారు. ఇలాంటివి పునరావృతం అయితే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు.

ఓబుళదేవర చెరువు :మండల పరిధిలోని తుమ్మల కుంట్ల పల్లిలో పల్లె పండుగ వారోత్సవాలను ఎంపీడీవో రాబర్ట్ విల్సన్ సోమవారం ప్రారంభించారు. సిసి రోడ్ల నిర్మానానికి ఈసందర్భంగా శంకుస్థాపన చేశారు. అనంతరం కుంట్లపల్లి సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సమయపాలన పాటించాలని సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులతో పాటు కుంట్లపల్లి నాయకులు వెంకటేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండల పరిధిలోని చామల గొంది వేపరాల తదితర గ్రామాలలో సిసి రోడ్ల నిర్మాణానికి అధికారులు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ మంజునాథ్, ఇసి సుబ్బారెడ్డి, సర్పంచులు శివప్పనాయుడు, ఆదిరెడ్డి, ఆంజనేయులు నాయక్, నాగరాజు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

నల్లచెరువు : మండలంలోని అల్లుగుండు గ్రామ పంచాయతీ రాట్నాలపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రఘునాథ్ గుప్తా, ఎంపీపీ రమణారెడ్డి, స్థానిక నాయకులు రామ్మోహన్, ఏవో భారతి, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు

పరిగి : గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని టిడిపి మండల కన్వీనర్ గోవింద్ రెడ్డి వెల్లడించారు. సోమవారం పరిగి మండలంలోని హొన్నంపల్లి ,శీరేకుళం గ్రామాలలో సిసి రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సూర్యనారాయణ, ఎంపీడీవో శ్రీధర్, సెక్రెటరీ ఆదినారాయణ, టిడిపి నాయకులు జగన్నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : మండలంలోని నల్లబోయనపల్లి,. డి. చెర్లోపల్లి గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణానికి సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహనాయుడు, సర్పంచులు ప్రభాకర్రెడ్డి, గుజ్జల రమాదేవి. ఏపీవో ఆదెప్ప, కార్యదర్శి నారాయణస్వామి, సచివాలయ, ఉపాధిహామీ పథకం సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : మండలంలోని గొట్లూరు,చిగిచెర్ల, సుబ్బారావు పేట, తుమ్మల పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులను అధికారులు సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాయి మనోహర్, ఏపీఓ అనిల్ కుమార్ రెడ్డి, , మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, టిఏలు చంద్రకళ, నాగేంద్ర, భారతి, లక్ష్మినారాయణ ఎఫ్ఎలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మడకశిర :'పల్లె పండుగ- పంచాయతీ వారోత్సవాలు' పేరుతో కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. మండలంలోని గౌడనహళ్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన పల్లె పండుగ వారోత్సవాల్లో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. వారు ముందుగా వాల్మీకి, కనకదాసు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీసీ రోడ్ల నిర్మాణనికి భూమిపూజ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం తాగునీటి సమస్యను పరిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నామన్నారు. ఈ నెల 20వ తేదీ వరకూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కుంచిటి వక్కలిగ రాష్ట్ర కన్వీనర్ వి.ఎం.పాండురంగప్ప, ఆసుపత్రి కమిటీ మెంబర్ కృష్ణమూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి కోట్ల రంగయ్య గౌడ్, నాయకులు నాగరాజు, కన్నా, అధికారులు పాల్గొన్నారు.

అగళి : మండలంలోని కోడిపల్లి పంచాయతీలో సోమవారం టిడిపి మండల అధ్యక్షులు కుమారస్వామి, ఉపాధి ఎపిఒ శివన్న, సర్పంచి నరసింహమూర్తి ఆధ్వర్యంలో 'పల్లె పండుగ' కార్యక్రమం నిర్వహించా రు. ఉదయం కోడిపల్లి పంచాయతీ సచివాలయం, మధ్యాహ్నం ఆర్‌జి.పల్లి సచివాలయంలో నిర్వహించారు.

పెనుకొండ : పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని మునిమడుగు పంచాయతీ పరిధిలోని అమ్మవారిపల్లి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఎంపిడిఒ నరేష్‌కృష్ణ, ఎపిఒ జయమ్మ అమ్మవారిపల్లిలో రూ. 10 లక్షలతో రెండు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ శ్రీదేవి, ఎపిఎం రాజు, టిడిపి నాయకుడు వాసుదేవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : మండలంలోని గుడిపల్లి గ్రామ పంచాయతీలో సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శాంతి, రవికుమార్, ఎపిఒ సోమశేఖర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, నాయకులు రమణప్ప, నాగరాజురావు, రంగప్ప, చలపతి, నరసింహులు, కార్యకర్తలు పాల్గొన్నారు